చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

- ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చితే గాలి కలుషితం
- ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం
- డంపింగ్ యార్డుల్లో పెద్ద ఎత్తున కాల్చివేత
- వాతావరణంలోకి కాలుష్య కారకాలు


డంపింగ్‌యార్డులో తగులబడుతున్న చెత్త

కడియం: ప్లాస్టిక్ వినియోగంతో ప్రజా జీవితాలకు పెనుముప్పు కలుగుతుందని ఒక పక్క నిపుణులు మొత్తుకుంటున్నారు. వాడకంతోనే తీవ్ర అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు. అయితే నేరుగా ప్లాస్టిక్‌ను తగలబెడుతూ ప్రజల ఆరోగ్యంతో యంత్రాంగం చెలగాటం ఆడుతోందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. జనావాసాల నుంచి వెలువడే ప్లాస్టిక్ వ్యర్థాలకు తోడు, మద్యం షాపులు, కిళ్లీ బడ్డీలు, జ్యూస్ స్టాళ్లు, కర్రీ పాయింట్ల నుంచి ప్రతి నిత్యం టన్నుల్లోనే ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఇవన్నీ గ్రామీణ ప్రాంతాల్లోని డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. అక్కడ వాటిని నిప్పు అంటించి కనిపించకుండా చేస్తున్నారు. తద్వారా వాతావరణంలో అత్యంత విషపూరిత కలుషితాలను నేరుగానే కలుపుతున్నారు.

రోజూ టన్నుకుపైగా వ్యర్థాలు

రూరల్ నియోజకవర్గంలోని గ్రామాల నుంచి ప్రతి నిత్యం టన్నుకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డులకు చేరుతున్నట్లు అంచనా. వీటిలో ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్లు, కవర్లతో పాటు విషపూరిత రసాయనాలను నిల్వ ఉంచేందుకు వినియోగించే డబ్బాలు, మస్కిటో రిపెల్లెంట్స్ బాటిళ్లు, వాడి పడేసిన ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, డైపర్ల తదితర అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు ఉంటున్నాయి. కొండల్లా పేరుకుపోతున్న ఈ వ్యర్థాలను వదిలించుకునేందుకు నిప్పు పెట్టడాన్నే ప్రధాన లక్ష్యంగా చేసుకుంటున్నారు.

గాలి కలుషితం

దాదాపు ప్రతి డంపింగ్ యార్డులోనూ నిత్యం ప్లాస్టిక్ చెత్త తగలబడుతూనే ఉంటోంది. ఇది మనం పీల్చేగాలిని తీవ్ర స్థాయిలోనే కలుషితం చేస్తోందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 50 కంటే తక్కువగా ఉంటేనే ఆ గాలిని పీల్చుకోవడం ఆరోగ్యకరమని అనేక నివేదికలు చెబుతున్నాయి. అయితే డంపింగ్ యార్డుల్లో నిత్యం ప్లాస్టిక్‌ను తగులబెట్టే ప్రాంతాల్లోనూ ఈ ఏక్యూఐ 70 నుంచి 119 వరకు ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా ప్రతి మొబైల్‌లోనూ ఈ ఏక్యూఐని చూపించే యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా పరీక్షిస్తే గాలి నాణ్యత ఆందోళనకరంగానే ఉంటోందంటున్నారు. మరింత శాస్త్రీయ పరికరాల ద్వారా ఈ పరీక్షలు చేస్తే ఇంత కంటే ఎక్కువగానే ఉంటుందని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పచ్చని పంట పొలాలు ఉండే చోట్ల కూడా గాలి నాణ్యత ప్రమాదకరంగా ఉంటోందంటే దీనికి ప్రధాన కారణంగా చెత్తను తగులబెట్టడమేనని చెబుతున్నారు.

ప్రచారానికే పరిమితం

తడి చెత్త, పొడి చెత్త అంటూ ప్రచారానికి మాత్రమే పరిమితమవుతున్న యంత్రాంగం ఆ తరువాత వీటిని గురించి పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడి చెత్త ద్వారా ఎరువులను ఉత్పత్తి చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న అధికారులు, పొడి చెత్తను ఏం చేస్తున్నారన్నదానికి మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఈ పొడి చెత్తలో అత్యధిక శాతం ప్లాస్టిక్ వ్యర్థాలేనని, వీటిని తగలబెట్టి చేతులు దులిపేసుకుంటున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ఆంక్షలు ఉన్నప్పటికీ, ఆయా వస్తువుల వినియోగం మాత్రం ఎక్కడా తగ్గిన దాఖలాల్లేవు. అలా వినియోగించిన వస్తువులు మొత్తం డంపింగ్ యార్డులు, పంట కాలువల్లోకే చేరుతున్నాయి. ఆ తరువాత కాల్చివేస్తున్నారు. ఇది అంతిమంగా ప్రజల ఆరోగ్యంపైనే తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

ఘాటైన వాసనతో ఇబ్బందులు

ప్రతి రోజూ డంపింగ్ యార్డులలో వెలువడే పొగ నుంచి ఘాటైన వాసన వేస్తోంది. దీంతో ఊపిరి తీసుకోవడం కూడా ఇబ్బందికరంగా మారుతోంది. వాహనాలపై వెళ్లే సమయంలో ఊపిరి బిగబట్టి ప్రయాణిస్తున్నాం. పొగ వెళ్లినంత దూరం నివాస ప్రాంతాల్లో ప్రజలకు ఆ ఇబ్బంది తప్పడం లేదు.

– వీవీఎస్‌ఎన్ మూర్తి, కడియపులంక

ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి

ప్లాస్టిక్‌ను పూర్తిగా అరికట్టాలి. దానికి ప్రత్యామ్నాయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. తాము తెచ్చిన ప్లాస్టిక్ వస్తువులను చెత్తతో పాటు పడేస్తే, అది తిరిగి తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తుందన్న రీతిలో చైతన్య పరచాలి. డంపింగ్ యార్డుల్లో చెత్తను తగలబెట్టడం వల్ల ప్రజారోగ్యాన్ని తీవ్ర ముప్పు కలుగుతుంది.

– కె.రాము, కడియం

కళారత్న పురస్కార గ్రహీతకు సత్కారం


మురళీకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భగవద్గీత శ్లోకాలను డాక్టర్ దంటు మురళీకృష్ణ పలు భాషల్లో ఆల్బమ్ చేశారని, ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం కళారత్న పురస్కారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు అన్నారు. ఉగాది పురస్కారాలలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా కళారత్న అవార్డు అందుకున్న మురళీకృష్ణను మంగళవారం నగరంలోని ఓ హోటల్లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ప్రెసిడెంట్ తీగల రాజా, జూపూడి మధుబాబు, ఇన్నమూరి రాంబాబు, ప్రముఖ వ్యాపారవేత్త కూర్మదాసు ప్రభాకర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య వాణిజ్య విభాగం నల్లమిల్లి సుబ్బారావు, వైస్ చైర్మన్ జూపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఇంటింటా ప్రచారం


ఇళ్లకు అతికించే స్టిక్కర్లను విడుదల చేస్తున్న అరుణ్ తదితరులు

ప్రకాశం నగర్: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ఇళ్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించ వద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై సర్దుబాటు చార్జీల భారాన్ని, బాదుడే బాదుడును కొనసాగిస్తోందన్నారు. అదానితో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని అమలు చేస్తూ ప్రజలపై మరో పిడుగు వేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్‌కు రూ.12 వేల భారాన్ని కూడా ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లను అతికిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వల రాంబాబు, బి.పవన్, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి


రంగంపేటలో తహసీల్దార్ అనసూయకు వినతి పత్రం అందిస్తున్న పాస్టర్లు

రంగంపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కోసు అనసూయ, ఎస్ఐ తోట కృష్ణసాయికి వినతి పత్రాలు అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అడపా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కొందరు తమ స్వప్రయోజనాల కోసం మతం అనే పిచ్చితో క్రైస్తవ, హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. అలాంటి వారిని అరికట్టి హిందూ, ముస్లిం, క్రైస్తవుల మధ్య సహోదరతత్వం, మత సామరస్యం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవ సమాజం, చర్చిలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం చైర్మన్, పాస్టర్, ఇవాంజలిస్ట్ కుసుమంచి కృష్ణంరాజు, పాస్టర్లు అడపా విజయ్ కుమార్, కోటేశ్వరరావు, చక్రవర్తి, పుష్పరాజ్, జాన్ పాల్గొన్నారు.

6న భారీ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్ఐ: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పతివాడ రామరాజు, కార్యదర్శి యడ్లపల్లి అయ్యప్ప తెలిపారు. జాంపేట గణేష్ చౌక్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామరాజు మాట్లాడుతూ నాలుగేళ్లుగా శ్రీరామనవమి రోజు భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మరింత శోభాయమానంగా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు పుష్కరాల రేవు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాల ప్రదర్శన ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి కడపకు చెందిన విరజానందస్వామి, అఖిల భారత ధర్మ జాగరణ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్ హాజరవుతారన్నారు. అయ్యప్ప మాట్లాడుతూ, సుమారు 25 వేల బైక్‌లతో ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు శంఖానాదంతో బైక్ ర్యాలీ ప్రారంభమై, త్రీటౌన్ పోలీస్ స్టేషన్, ఆర్యాపురం, పేపర్ మిల్లు, శ్రీరామ నగర్, కోరుకొండ రోడ్డు, కంబాల చెరువు, నందం గనిరాజు జంక్షన్, దానవాయిపేట, ఏవీ అప్పారావు రోడ్డు రామాలయం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, షెల్టాన్ హోటల్, ఆవలో వాంబే గృహాలు, తాడితోట, స్టేడియం రోడ్డు, శ్యామలా సెంటర్ మీదుగా తిరిగి పుష్కర్ ఘాట్‌కు చేరుకుంటుందని వివరించారు.

ఉత్సాహంగా ఉగాది పురస్కారాల ప్రదానం


జిత్‌మోహన్‌మిత్రను సత్కరిస్తున్న ప్రముఖులు

ధవళేశ్వరం: సినీ నటుడు, గాయకులు, శ్రీపాద జిత్ మోహన్ మిత్ర, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్ దంపతులు, యోగా గురువు తలాటం సూర్యప్రకాశరావు తదితరులకు ఉగాది పురస్కారాలను అందించారు. గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం, వాసవి కళానికేతన్, ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ధవళేశ్వరంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా కుమార రామం లక్ష్మీ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అధ్యక్షుడు వేలివెంటి నాగ వరప్రసాద్ (రాజా) అధ్యక్షతన సభ జరిగింది. విశిష్ట అతిథులు చేతుల మీదుగా ముత్య శంకరరావు రాసిన శంకరాంతరంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న చిన్నారికి రూ.30 వేల చెక్కు, గోసంరక్షణ కోసం రేడియం మెడబ బెల్టులు అందించారు. చిన్నారులు చేసిన సంప్రదాయ, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పంచాంగ కర్త దారముక్కల అనిల్ కుమార్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి దిశా అభ్యుదయ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు పన్నాల లక్ష్మి, కన్స్యూమర్ రైట్స్ జాతీయ అధ్యక్షులు సాయి రమేష్, కుమార రామ్, హైకోర్టు అడ్వకేట్ తులసి, సభాపతి మంగళంపల్లి చంద్రశేఖర శాస్త్రి, నాగఫణి శర్మ, ఆదుర్తి విశ్వ మోహన్ పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

కోరుకొండ: బూరుగుపూడి గ్రామ దేవత పోశాలమ్మ వారి జాతర ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు 400 కేజీలు బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఆయన ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రాలో 300 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, ఆలయ ధర్మకర్త మేడిన ప్రసాద్, పూజారి మాగాపు వీరబాబు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులకు షాక్

- ఈ–కేవైసీ తప్పనిసరి చేసిన కూటమి ప్రభుత్వం
- లేకపోతే రేషన్ కట్
- ఈ నెలాఖరు వరకూ గడువు
- దూర ప్రాంతాలకు వెళ్లిన కూలీల ఆవేదన


ఎండీయూ వాహనంలో రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

బిక్కవోలు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించేందుకు అనేక సర్వేలను నిర్వహిస్తోంది. ఇప్పటికే దివ్యాంగులకు ఇచ్చిన సర్టిఫికెట్లపై సమీక్ష చేయించింది. తాజాగా రేషన్ కార్డుల్లో ఉన్న యూనిట్లు తగ్గించి, రేషన్ బియ్యం మిగుల్చుకోవడానికి కుట్ర చేస్తోంది. కార్డుల్లో ఉన్న ప్రతి లబ్ధిదారుడూ ఈ–కేవైసీ చేయకపోతే రేషన్ ఇవ్వడం జరగదని ప్రచారం చేస్తోంది. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబాన్ని ఒక్కో యూనిట్‌గా పరిగణించి ఈ–కేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఐదేళ్ల లోపు చిన్నారులకు అవసరం లేదు. మిగిలిన వారందరూ డీలర్లు, వీఆర్వోలు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద తక్షణమే ఈ–కేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీని కోసం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు విధించింది. దీనివల్ల వ్యవసాయ కూలీలకు కష్టం వచ్చింది. గతంతో వేలి ముద్రలు లేకుండా ఫోటోల ఆధారంగా చేసుకునే అవకాశం ఉండేది.

పేదల పొట్ట కొట్టొద్దు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఉన్న పథకాలను కత్తిరిస్తోందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పడు బియ్యం కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని మండిపడుతున్నారు. పేదల పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. నెలకు ఒక్కో యూనిట్‌కు 5 కేజీల బియ్యం మాత్రమే ఇస్తున్నారని, ఇదే ప్రభుత్వానికి భారమైందా అని ఆవేదన చెందుతున్నారు. ఈ–కేవైసీ పూర్తికాని వారికి కూడా బియ్యం ఇవ్వాలని కోరుతున్నారు.

వలసదారుల్లో ఆందోళన

ఉపాధి, విద్య ,ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఈ–కేవైసీ విషయంపై ఆందోళన చెందుతున్నారు. ఏ గ్రామంలో రేషన్ కార్డు ఉందో అదే గ్రామానికి వచ్చి ఈ–కేవైసీ చేసుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాల్లో ఉన్నవారికి ఇబ్బందులు తప్పడం లేదు. వారికి మరింత గడువు ఇవ్వాలని స్థానికంగా ఉండే కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మరో పక్క ఈ–కేవైసీ పూర్తి చేయాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు.

నియోజకవర్గంలో వివరాలు

మండలం	మొత్తం యూనిట్లు	ఈకేవైసీ పూర్తయినవి
అనపర్తి	58,273	53,751
బిక్కవోలు	60,450	55,928
పెదపూడి	62,795	57,046
రంగంపేట	55,890	49,190
మొత్తం	2,37,408	2,15,915

కూలీలకు సమయం ఇవ్వాలి



రేషన్ కార్డుల్లో ఉన్న కూలీలు ఈ–కేవైసీ చేయించుకోవడానికి మరింత గడువు ఇవ్వాలి. చాలామంది ఉపాధి పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లారు. వారు తమ స్వగ్రామానికి రావడానికి కొంత సమయం పడుతుంది.

– గొర్రిపోటి లక్ష్మి, పందలపాక

ఈ నెల 30 వరకే గడువు



రేషన్ కార్డులో పేరు ఉండి ఈ–కేవైసీ పెండింగ్ ఉన్నవారు ఈ నెల 30వ తేదీలోగా ఈ ప్రకియను పూర్తి చేయించుకోవాలి. అలాంటి వారందరూ తమ డీలర్‌ను, సంబంధిత సిబ్బందిని సంప్రదించాలి.

– బీఎస్‌వీవీ కృష్ణ, తహసీల్దార్, బిక్కవోలు

క్లుప్తంగా

నేటి నుంచి పాలిసెట్‌కు శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి పాలిసెట్ పరీక్షకు ఉచిత శిక్షణ ప్రారంభం కానుంది. కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు ఈ విషయాన్ని మంగళవారం ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకూ శిక్షణ ఇస్తారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఈనెల 30న జరుగుతుందని, దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15 వరకూ గడువు ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ఆటో, సారాతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య ఆదేశాల మేరకు ఏఈఎస్ పి.నాగ రాహుల్ ఆధ్వర్యంలో నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.త్రినాథ్, ఎస్సై, సిబ్బంది మంగళవారం పేపరు మిల్లు వెనుక గల శ్రీరామ్‌నగర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలో తరలిస్తున్న 150 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కొయ్యల ప్రేమ్‌కుమార్, నిమ్మది నవీన్‌లను అరెస్టు చేశారు. ఈ కేసులో వేముల బాలాజీని అరెస్టు చేయాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ త్రినాథ్ తెలిపారు.

ఉపాధి హామీ పనుల ప్రారంభం


జేగురుపాడులో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ స్టాలిన్ తదితరులు

కడియం: మండలంలోని జేగురుపాడులో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించారు. ముత్యాలమ్మ గుడి నుంచి మురమండ వంతెన వరకు వెయ్యి మీటర్ల మేర కాలువ పూడికతీత పనులను ఆ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి సూర్యరామకృష్ణ కొబ్బరికాయలు కొట్టి మొదలు పెట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, స్థానిక నాయకులు మర్రెడ్డి రమేష్, కర్రి చినబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం సందర్శన


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి లక్ష్మి

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.లక్ష్మి మంగళవారం సందర్శించారు. అక్కడి బాలురతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పర్యవేక్షణలో గృహంలో ఉపాధ్యాయులు చెబుతున్న పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణ, సహనశీలత మనిషికి ఉండాల్సిన ముఖ్య లక్షణాలని, వాటిని అలవర్చుకుని మంచిస్థాయికి ఎదగాలన్నారు. ఉచితంగా న్యాయవాదిని పొందడం వారి హక్కు అన్నారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

సినిమాలు



శ్యామల	రాబిన్‌హుడ్
సూర్యమినీ	సికిందర్
సూర్యప్యాలెస్	మ్యాడ్ స్క్వేర్
స్వామి	కోర్ట్
శివజ్యోతి	రాబిన్‌హుడ్
అనుశ్రీ	వీరధీరశూర
రాజా	రాబిన్‌హుడ్
ఊర్వశి	ఎల్2ఎంపురాన్
మేనక	సికిందర్
రంభ	కోర్ట్
కుమారి	మ్యాడ్ స్క్వేర్
అప్సర	మ్యాడ్ స్క్వేర్
అశోక	మ్యాడ్ స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	రాబిన్‌హుడ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	మ్యాడ్ స్క్వేర్
కడియం	
వెంకటసూర్య	మ్యాడ్ స్క్వేర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మోరంపూడి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల కోసం బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వీఎల్ పురం, వీఎల్ పురం పార్క్ స్ట్రీట్స్, పెద్ద వీధి, ఆదర్శ హాస్పిటల్ రోడ్, తిలక్ రోడ్, శ్యామలాంబ స్కూల్ ఏరియా, అక్షరశ్రీ స్కూల్, వినాయక గుడి, సిద్ధార్థ హాస్పిటల్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ మంతెన గార్డెన్స్, కందుల దుర్గేష్ వీధి, భాను టెక్స్‌టైల్స్ స్ట్రీట్, తిలక్ రోడ్, సంగీత వెంకట రెడ్డి వీధి, జేఎన్ రోడ్, అపోలో హాస్పిటల్ వీధిలలో సరఫరా ఆగిపోతుంది.
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సువిశేషపురం, మల్లికార్జున నగర్, సుబ్బారావు పేట, టీటీడీ రోడ్ ఏరియా, ఎస్‌కేవీటి స్కూల్ వీధి పరిధిలో కొన్ని ప్రాంతాలలో ప్రభావం ఉంటుంది.

నేడు వ్యవసాయ విద్యుత్‌కు..

కడియం: ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మత్తుల్లో భాగంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఆ సమయంలో కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, పొట్టిలంక గ్రామాల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ మేరకు రైతులు సహకరించాలని కోరారు.

వైభవంగా శ్యామలాంబ జాతర


జాతరలో గరగ నృత్యాల సందడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు వద్ద కొలువైన శ్యామలాంబ అమ్మవారి జాతరోత్సవం మంగళవారం సాయంత్రం ఆలయ నిర్మాణకర్త బత్తిన అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గరగ నృత్యాలు, మంగళ వాయిద్యాలతో అమ్మవారిని పుర వీధులలో ఊరేగిస్తూ పెద్ద సోమాలమ్మ గుడికి తీసుకువెళ్లారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో పార్థివ లింగాల తయారీ

పెదపూడి: జి.మామిడాడ గ్రామ శివారు ఎల్ఎన్ పురం పాటిమీద మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పార్థివ శివలింగాలను తయారీ భక్తిశ్రద్ధలతో జరుగుతోంది. భూ కైలాస రిలేజెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుట్టమట్టితో వీటిని తయారు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మార్చి 20వ తేదీన మొదలైన ఈ కార్యక్రమం 15 రోజుల పాటు జరగనుంది. దీనిలో పాల్గొన్న భక్తులందరికీ కమిటీ తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. శివలింగాల తయారీ ఈ నెల 7వ తేదీతో ముగియనుంది. కాగా.. రోజుకు 1,11,111 శివలింగాల తయారు చేస్తున్నారు. వాటిని గ్రామంలో ఊరేగించి అనంతరం ట్రస్ట్ వారికి అందజేస్తారు. కార్యక్రమంలో సబ్బెళ్ల వీర వెంకట సత్యనారాయణరెడ్డి, శ్రీలక్ష్మి, సబ్బెళ్ల సత్తి రెడ్డి, ఉమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అరవాలమ్మ జాతర

సీతానగరం: మండలంలోని చీపురుపల్లి పంచాయతీ పరిధి అచ్చయ్యపాలెంలో కొలువైన అరవాలమ్మ జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.